ప్రజాశక్తి

ఆదివారం 19 మే, 2024

5

శ్రీకాకుళం

మెడికల్ డిప్లమో టాపర్‌గా లలిత

లలితకుమారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మెడికల్ డిప్లమో ఇన్ క్యాత్ ల్యాబ్ టెక్నాలజీ ఫలితాల్లో మండలంలోని చీమలవలసకు చెందిన పేడాడ లలిత కుమారి రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. శనివారం విడుదలైన ఫలితాల్లో 360 మార్కులకు గానూ 306 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులోని జెమ్స్‌లో లలితకుమారి ఈ కోర్సును అభ్యసించింది. లలిత కుమారి తండ్రి హేమసుందరరావు వ్యవసాయ కూలీ కాగా, తల్లి విజయలక్ష్మి గృహిణి. లలిత కుమారి అత్యధిక మార్కులు సాధించి టాపర్‌గా నిలవడంపై కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నగర పాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కలగా మిగిలింది. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వీరందరినీ క్రమబద్ధీకరిస్తానని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. వీరందరినీ ఎపి అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) పరిధిలోకి తీసుకొచ్చారు. దీంతో గతంలో ఇచ్చిన వేతనాల్లో కోత పడింది. సమాన పనికి సమాన వేతనం దక్కడం లేదు. ఎన్నో ఏళ్లుగా సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు అనేక పోరాటాలు చేశారు. ఆప్కాస్ నుంచి తప్పించి క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ ఇప్పటికీ అమలు కాలేదు.

ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)

కలగా మిగిలిన క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థలో గతంలో ఎన్ఎంఆర్‌లుగా 114 మంది పనిచేసేవారు. పోరాటాల వల్ల 2008లో నాటి ప్రభుత్వం వీరిని కనీస వేతన ఉద్యోగులుగా మార్చడంతో కొంత ఉపశమనం కలిగించింది. వీరందరినీ క్రమబద్ధీకరిస్తామని 2019 ఎన్నికలకు ముందు సిఎం జగన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక షరతులను విధించి చివరకు క్రమబద్ధీకరణ చేపట్టకుండా విడిచిపెట్టారు. సుమారు మూడు దశాబ్దాలుగా విధులు నిర్వర్తిస్తున్న వీరంతా క్రమబద్ధీకరణపై ఎన్నో ఆశలు పెంచుకున్నారు. వీరిలో కొందరు వివిధ కారణాలతో మృతి చెందితే... మరి కొందరు వయసు పైబడడంతో ఉద్యోగ విరమణ చేశారు. గతంలో వీరంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలు సైతం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా 11వ పిఆర్‌సి ప్రయోజనాలు వీరికి నేటికి అందలేదు. మృతి చెందిన కుటుంబాలకు దహణ సంస్కారాల ఖర్చులు, కారుణ్య నియామకాలు లేక మృతుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరువు భృం, ప్రోత్సాహకాల వంటివీ దక్కడంలేదు.

'ఆప్కాస్' వల్ల అందని ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎపి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) వల్ల కార్మికులకు ఆర్థిక ప్రయోజనం చేకూరడం లేదు. కార్మికుల వేతనాల సొమ్మును ఆప్కాస్‌కు ప్రతినెలా నగరపాలక సంస్థ జమ చేయాలి. దీనిపై 18 శాతం జిఎస్‌టి కింద చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు ఆప్కాస్‌కు చెల్లిస్తున్న సొమ్ములో ఒక శాతాన్ని కార్పొరేషన్ తన కమీషన్ కింద మినహాయించుకుంటోంది. ఈ భారమూ నగర పాలక సంస్థే భరించాల్సి వస్తోంది. కార్మికుల వేతనాల నుంచి ఇఎస్ఐ, పిఎఫ్ మొత్తాలను మినహాయించుకుంటున్నా.. సంబంధిత విభాగాలకు సక్రమంగా జమ కావడం లేదు. దీనివల్ల కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలుగుతోంది. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనం, హెల్త్ అలవెన్స్ కలిపి ఒక్కొక్కరికి రూ.21 వేలు చెల్లిస్తుండగా.. ఇఎస్ఐ, పిఎఫ్ మినహాయింపుతో వారి చేతికి రూ.18 నుంచి రూ.19 వేలు మాత్రమే అందుతోంది. ఉద్యాన విభాగంలోని కార్మికులు ఆప్కాస్ కింద ఉండగా, వీరికి కత్తిరింపులు పోను చేతికి వచ్చేది రూ.13 వేలు. వీరు ఆరోగ్యం సక్రమంగా లేక, అత్యవసర పనుల వల్ల విధులకు హాజరుకాకపోయినా వేతనంలో కోత తప్పడం లేదు. తాగునీటి సరఫరా విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ. 15 వేలు వేతనం ఇస్తున్నారు.

కనీస వేతనాలకు నోచుకోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

న్యాయం చేయాలి

నగరపాలక సంస్థలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న టైంస్కేల్ వర్కర్లకు ఆప్కాస్ నుంచి తప్పించి క్రమబద్ధీకరించాలి. దీనికితోడు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నాం. ఇఎస్ఐ, పిఎఫ్ మొత్తాలను కార్మికులు, ఉద్యోగుల నుంచి కట్ చేస్తున్నా వారి ఖాతాలకు జమ కావడంలేదు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలి.

- పి.తేజేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

తీరని అన్యాయం

పారిశుధ్య పనుల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్నా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదు. దీనికితోడు ఏదైనా కారణంతో కార్మికులు మృతి చెందితే వారికి దహన సంస్కార ఖర్చులు చెల్లించడంలేదు. సకాలంలో ఇఎస్ఐ, పిఎఫ్ మొత్తాలు జమచేయకపోవడంతో అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలపై అనేక మార్లు విన్నవించుకున్నా నేటికీ పరిష్కారం కావడం లేదు.

- ఎన్.బలరాం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ముకేశ్ కుమార్ మీనా

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. మండలంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం పార్లమెంట్, ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి శనివారం పరిశీలించారు. అక్కడ ఉన్న భద్రతా ఏర్పాట్లను గమనించారు. తలుపులకు వేసిన తాళాలు, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్నిచోట్లా సిసి కెమెరాలను పరిశీలన చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. మూడంచెల గల కేంద్ర పోలీసు బలగాల గార్డు, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమా అన్సారియా, టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, డిపిఒ వెంకటేశ్వరరావు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, అప్పారావు, లక్ష్మణమూర్తి, సుదర్శన్ దొర, రామ్మోహనరావు, తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

సిఐటియు సీనియర్ నాయకులు బి.కృష్ణమూర్తి

సుందరయ్య చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం, సంస్కరణల ఉద్యమాల ప్రభావం ఆయనపై ఎక్కువగా ఉందన్నారు. భూసంస్కరణల అమలు కోసం భూ పోరాటాలు సాగించారని చెప్పారు.

కమ్యూనిస్టు భావజాల వ్యాప్తి కోసం పత్రిక అవసరాన్ని గుర్తించి ప్రజాశక్తి స్థాపించారని, పత్రిక అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడ్డారని తెలిపారు. ప్రజల కోసం తన ఆస్తులను, జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు మాట్లాడుతూ సమ సమాజం కోసం సుందరయ్య పనిచేశారని కొనియాడారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళమెత్తి వాటి పరిష్కారం కోసం పనిచేశారని గుర్తు చేశారు. ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు అధ్యక్షత వహించిన సభలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు, స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిర్గిస్థాన్‌లో అల్లర్లపై ఆందోళన

- **పిల్లల యోగక్షేమాలపై ఆరా తీస్తున్న తల్లిదండ్రులు**
- **విద్యార్థులకు రక్షణ కల్పించాలి**
- **విదేశాంగశాఖకు ఎంపీ లేఖ**

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

కిర్గిస్థాన్ రాజధాని బిషెక్‌లో విదేశీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని హింస చెలరేగడంతో జిల్లాకు చెందిన పలువురు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు చెందిన విద్యార్థులు కిర్గిస్థాన్‌లో వైద్య విద్యనభ్యసించడానికి పదుల సంఖ్యలో అక్కడకు వెళ్లారు. ప్రస్తుతం అక్కడ కొంత మంది దాడులకు దిగడంతో తల్లిదండ్రులు టెన్షన్‌కు లోనయ్యారు. తమ పిల్లలకు ఫోన్ చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, సరుబుజ్జిలి తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు అక్కడి హాస్టల్‌లో ఉండి ఎంబిబిఎస్ చదువుతున్నారు. అయితే వారు ఉంటున్న ప్రాంతాల్లో గొడవలు జరగడం లేదని తెలియడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. కిర్గిస్థాన్, ఈజిప్ట్ దేశాలకు చెందిన విద్యార్థుల మధ్య ఈ నెల 13 జరిగిన ఘర్షణకు సంబంధించి వీడియోలు వైరల్ కావడంతో దాడులకు దారి తీసినట్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిసింది. ఆ తర్వాత కొంతమంది భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొన్ని ప్రాంతాల్లో దాడులకు దిగినట్లు విద్యార్థులు తెలిపారు.

విద్యార్థులకు భద్రత కల్పించాలి

వైద్య విద్యను అభ్యసించడానికి కిర్గిస్థాన్ వెళ్లి అక్కడి అల్లర్లలో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన వైద్య విద్యార్థులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని విదేశాంగశాఖకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు లేఖ రాశారు. ఈ మేరకు లేఖ ప్రతిని శనివారం పత్రికలకు విడుదల చేశారు. కిర్గిస్థాన్‌లో జిల్లా నుంచి సుమారు 250 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారితోపాటు రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారని పేర్కొన్నారు. కిర్గిస్థాన్‌లో అల్లర్ల నేపథ్యంలో భారత విద్యార్థులను రక్షించాలని కోరారు. అక్కడున్న భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి వారి యోగ క్షేమాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు విశ్వవిద్యాలయాలు విడిచి బయటకు రాకుండా మార్గదర్శకాలు పాటించాలని సూచించారు.

ఎన్నికల విధులకు

ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ డ్యూటీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన కలెక్టర్‌ను సంఘం తరుపున అభినందనలు తెలిపారు. అనంతరం ఎన్నికల సమస్యలను వివరించారు. ఎన్నికల విధులులో భాగంగా రిసీవింగ్ సెంటర్లలో ఈ నెల 14న ఉదయం వరకు విధులు నిర్వర్తించిన పిఒ, ఎపిఒ, ఒపిపిఒలకు రెమ్యూనరేషన్ చెల్లించాలన్నారు. అలాగే హోమ్ ఓటింగ్ విధులు నిర్వహించిన వారికి ట్రైనింగ్ నిమిత్తం రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. రిజర్వు విధుల్లో ఉన్న వారిలో కొంతమందికి రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో వ్యత్యాసాన్ని సరి చేయాలని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ... ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఎన్నికల విధుల ధ్రువపత్రాలను వెంటనే అందజేస్తామని అన్నారు. ఎన్నికల బడ్జెట్‌ను సరిచూసి అవకాశమున్న ప్రాప్తికి 14న కూడా రెమ్యూనరేషన్ మంజూరుకు పరిశీలిస్తామని చెప్పారు. మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పడి కూలీ మృతి

ధర్మారావు మృతదేహం

పొందూరు: విద్యుత్ లైన్ పనుల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న స్తంభం అదుపు తప్పి పడిపోవడంతో శ్రీకాకుళం రూరల్ మండలం మామిడివలసకు చెందిన పాగోటి ధర్మారావు (48) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మండలంలోని రెడ్డిపేట-తానెం మధ్య విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులకు కూలీగా మామిడివలసకు చెందిన ధర్మారావు వచ్చాడు. పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాన్ని పైకి ఎత్తుతున్న సమయంలో అదుపు తప్పి ధర్మారావుపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన్ను శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలాస

2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పలాస డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ ప్రకటనలో కోరారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మే 10 నుంచి జూలై 10 సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పరిశీలన సమయంలో రిజిస్ట్రేషన్ ఐడి పత్రంతోపాటు ఒరిజినల్ పదో తరగతి మార్కులు షీట్, తరగతి ధ్రువపత్రం, ఆధార్, మెయిల్ ఐడి, ఫోన్ నంబర్లతో సమీపంలోని ఐటిఐ వద్దకు వెళ్లి ధ్రువపత్రాలు పరిశీలించుకోవాలన్నారు. పలాస డాక్టర్ వి.కణితీష్ ప్రభుత్వ ఐటిఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెక్, డ్రాఫ్ట్ మాన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కోపా ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు.

సిపిఆర్‌తో పునర్జీవనం

డెమో ప్రదర్శిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నేటి యాంత్రిక జీవితంలో ఒత్తిళ్ల కారణంగా గుండెపోటు సంభవించి ప్రాణాలు కోల్పోతున్నారని, సకాలంలో ప్రథమ చికిత్స అందించడం వల్ల వారి ప్రాణాలను కొంతవరకు కాపాడే అవకాశముందని ప్రముఖ వైద్య నిపుణులు కూర్మాన వినోద్‌కుమార్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జెసిఐ జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన 'గుండెపోటు-ముందస్తు జాగ్రత్తలు'పై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గుండెపోటుతో ఆగిన గుండెను సకాలంలో సిపిఆర్ ప్రక్రియతో పునర్జీవనంలోకి తీసుకురావచ్చన్నారు. ఆకస్మిక గుండెపోటు వల్ల నూటికి 80 నుంచి 90 శాతం ఆస్పత్రులకు చేరే లోపు మృతి చెందే ప్రమాదం ఉందన్నారు. గుండెపోటు వచ్చిన రోగికి సత్వరం సిపిఆర్ అందివ్వడం ద్వారా ఆకస్మిక మరణాలను తగ్గించగలమన్నారు. జెసిఐ అధ్యక్షులు బగాది ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అందరికీ అన్నివేళలా వైద్యం అందుబాటులో ఉండదని, అటువంటి సమయాల్లో ప్రథమ చికిత్స ఎంతో అవసరమన్నారు. దీనిపై అవగాహన ఉంటే ఆస్పత్రికి చేర్చే లోపు ప్రాణాలు కాపాడగలమన్నారు. గుండెపోటు వస్తే అత్యవసరంగా చేపట్టాల్సిన సిపిఆర్ విధానం ఎలా చేయాలో డెమో ప్రదర్శించారు. కార్యక్రమంలో జెసిఐ సెక్రటరీ సింగూరు ప్రవీణ్, ఐతమ్ వెంకటేష్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతుచిక్కని ఓటరు నాడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల యుద్ధం ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాలతో పోటీ పడ్డారు. ఓటరు తీర్పు ఇవిఎంల్లో నిక్షిప్తమైంది. జూన్ నాలుగో తేదీన ఫలితాలు రానున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. కేంద్రాల వారీగా పోలైన ఓట్లు, గతసారి పడిన ఓట్లు, ఇప్పుడు కలిసొచ్చిన అంశాలేమిటి, ఏఏ కేంద్రాల పరిధిలో ఎవరికి ఎన్ని ఓట్లు అనుకూలంగా పడ్డాయి.. మహిళలు, వృద్ధులు ఎటువైపు మొగ్గు చూపారు... ఇలా కూడికలు, తీసివేతలతో లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు. మరోవైపు జిల్లాలో ఓటింగ్ సరళిపైనా చర్చించుకుంటున్నారు. జిల్లాలో ఈసారి రికార్డు స్థాయిలో 76.81 శాతం పోలింగ్ నమోదు కావడాన్ని ఎవరికి వారే తమ గెలుపునకు అన్వయించుకుంటున్నారు. ఓటింగ్ భారీగా ఉండడంతో, తమకే మేలు చేకూరుతుందని ఇరు పార్టీలూ లెక్కలు వేసుకుంటున్నాయి. సాధారణంగా పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైతే, దాన్ని ప్రభుత్వ వ్యతిరేక ఓటుగానే రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తుంటారు. చాలాసార్లు ఫలితాలూ అలానే వచ్చాయి. గత ఎన్నికల్లో 75 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం, ఫలితాలు వైసిపికి అనుకూలంగా రావడంతో వైసిపి శ్రేణుల్లో భయం పట్టుకుంది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సంక్షేమ పథకాల అమలుతో సానుకూలంగా ఓటింగ్ జరిగిందని, తామే అధికారంలోకి రాబోతున్నామని విలేకరుల సమావేశంలో వెల్లడించడంతో కార్యకర్తలు కొంత కుదటపడ్డారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరావతిలోని ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి తాము 150కి పైగా ఎమ్మెల్యే, 22 ఎంపీ స్థానాలను గెలవబోతున్నామని, అంతా ఆశ్చర్యపోయేలా ఫలితాలు వస్తాయని చెప్పడంతో కేడర్‌లో విశ్వాసాన్ని నింపారు. మహిళా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలిరావడం తమకు సానుకూల అంశంగా వైసిపి అభ్యర్థులు భావిస్తున్నారు. జిల్లాలో పురుష ఓటర్ల పోలింగ్ శాతం 75.39 ఉండగా, మహిళల ఓటింగ్ 78.21 శాతంగా ఉంది. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతో ఇస్తుండడంతో, వారంతా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి వైసిపికి వేశారని ఆ పార్టీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మహిళా ఓటర్లు, పురుష ఓటర్ల మధ్య వ్యత్యాసం దాదాపు పది శాతంగా ఉంది. ఇక్కడ పురుష ఓటర్ల శాతం 65.49 శాతం ఉండగా, మహిళా ఓటర్ల శాతం 75.36 శాతంగా ఉంది. మహిళా ఓటర్ల శాతం ఎక్కువగా ఉండడంతో మహిళా అభ్యర్థిగా తననే ప్రజలు ఆదరించారని, తాను కచ్చితంగా విజయం సాధిస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వైసిపికి మళ్లీ గెలిచినంత సీన్ లేదని, అధికారంలోకి కూటమి ప్రభుత్వమే వస్తుందని టిడిపి నేతలు మరోవైపు కౌంటర్ ప్రకటనలు ఇస్తున్నారు. జిల్లాలో ఓటింగ్ సరళి తమకే అనుకూలంగా ఉందని వాదిస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత వల్లే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారని, విజయం తమదేనని వారు ఘంటాపథంగా చెప్తున్నారు. సంక్షేమ తప్ప అభివృద్ధి లేదని... ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర తరగతులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, వారంతా టిడిపి వైపే మొగ్గు చూపారని ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. పింఛన్ సొమ్మును రూ.3 వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచడం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత బస్సు ప్రయాణంతో పాటు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లిందని వారు విశ్వసిస్తున్నారు. గతంలో టిడిపి, జనసేన విడివిడిగా పోటీ చేయడం వల్ల నష్టపోయామని, ఈసారి బిజెపిని కలుపుకొని మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్ల ఓటింగ్ కన్సాల్డేటెడ్ అయిందని, తప్పక విజయం సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో అధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ఇరు పార్టీల నాయకులు చెప్తున్నా, క్రాస్ ఓటింగ్ గుబులు మాత్రం వారిని వెంటాడుతోంది. ఎమ్మెల్యే స్థానాలకు శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ సాగినట్లు తెలుస్తోంది. టిడిపి సానుభూతిపరులు కొందరు వైసిపికి ఓటు వేశారన్న చర్చ నడుస్తోంది. అదేవిధంగా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో వైసిపి అభిమానులు కొందరు టిడిపి ఎంపీ రామ్మోహన్ నాయుడుపై అభిమానం చూపినట్లు చర్చ నడుస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపి సానుభూతిపరులు ఒక ఓటు వైసిపికి వేసి, మరొకటి టిడిపికి వేసినట్లు చర్చ నడుస్తోంది. ప్రధానంగా శ్రీకాకుళం నగరంలో దీని ప్రభావం ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ ఇవ్వలేదన్న కోపంతో పార్టీ అభిమానులు కొందరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసినట్లు సమాచారం. పాతపట్నంలో టిడిపి సానుభూతిపరులు కొందరు ఎమ్మెల్యే స్థానానికి ఫ్యాన్ గుర్తుకు, ఎంపీ స్థానానికి సైకిల్‌కు వేసినట్లు చర్చ నడుస్తోంది. ఇక్కడ మాత్రం టిడిపి నుంచి వైసిపి వైపు భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో వైసిపి అభ్యర్థికి అనుకూలంగా ఓటింగ్ జరిగిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఎంపీ అభ్యర్థులకూ వారికి కచ్చితంగా పడాల్సిన ఓట్లు పడలేదనే చర్చ సాగుతోంది. ప్రధానంగా వైసిపి ఎంపీ అభ్యర్థికి రావాల్సిన ఓటు టిడిపి అభ్యర్థికి మళ్లినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో టిడిపి ఎంపీ అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరగడంతో వైసిపిలో ఆందోళన నెలకొంది. తానెవరికి ఓటు వేయాలో వేసి ప్రశాంతంగా ఓటరు తన పని తాను చేసుకుంటున్నాడు. అభ్యర్థులు మాత్రం ఓటరు నాడి అంతు చిక్కక ఓట్ల లెక్కలతో కుస్తీ పడుతూనే ఉన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన జరుగనున్న ఎన్నికల కౌంటింగ్ వరకు అభ్యర్థులు, నాయకులు, శ్రేణులకు కూడికలు, తీసివేతలతో కాలం గడపక తప్పదు.

పరామర్శిస్తున్న రవికుమార్

ఓటమి భయంతోనే వైసిపి దాడులు

ప్రజాశక్తి- పొందూరు

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించే తట్టుకోలేక వైసిపి దాడులకు పాల్పడు తుందని ఆమదాలవలస టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి సాను భూతిపరుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలింగ్ రోజున వైసిపి పట్ల ప్రజావ్యతిరేత వ్యక్తం కావడంతో ఎన్నికల్లో తమ పరాజయం తప్పదని వైసిపి నాయకులు గ్రహించారని పేర్కొన్నారు. దీంతో పోలింగ్ అనంతరం తమను వ్యతిరేకించిన వారిపై వైసిపి నాయకులు, గూండాలు దాడులు చేస్తూ హింసకు పాల్పడుతున్నారని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వితం కాదని వైసిపి నాయకులు గ్రహించాలన్నారు. మళ్లీ తమదే అధికారం అంటూ మేకపోతు గాంభీర్యాన్ని వైసిపి ప్రదర్శిస్తున్నప్పటికీ లోపల మాత్రం తమకు ఓటమి ఖాయమని వైసిపి నాయకులకు తెలుసునని తెలిపారు. భారీ మెజార్టీతో కూటిమి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

బాలల హక్కులను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

భారత రాజ్యాంగం ప్రకారం బాల బాలికలకు కల్పించిన బాలల హక్కులను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం పట్టణంలోని పాతినవారివీధిలో ఉన్న ఐసిడిఎస్ కార్యాలయంలో ఐసిడిఎస్ పిఒ అనురాధ ఆధ్వర్యంలో బాలలహక్కులపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిఒచారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి మాట్లాడుతూ బాలల హక్కులను హరించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అటువంటి వారిని శిక్షించడానికి న్యాయ విభాగంలో ప్రత్యేక చట్టాలున్నాయని అన్నారు. బాలల హక్కులను కాపాడడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్, ఎజిపి సీపాన గోవిందరావు, న్యాయవాదులు తమ్మినేని అన్నం నాయుడు, బొడ్డేపల్లి మోహనరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయ్, లీలారాణి, జివి రత్నం, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న డిపిఆర్ఒ సింగ్

'యుజెఎఫ్' హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ (యుజెఎఫ్) 2024-25 హ్యాండ్ బుక్‌ను డిపిఆర్ఒ కె.బాల్ మాన్ సింగ్ డిఐపిఆర్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు జర్నలిస్టుల ఫోన్ నెంబర్లతో కూడిన హ్యాండ్‌బుక్ అన్ని వర్గాలకు ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పలు సామాజిక అంశాలపై స్పందించిన ఫ్రంట్ భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర ప్రతినిధి కనకరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇజ్జాడ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులపై శనివారం పదోతరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలం కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కలిసి కళాశాలలో జనరల్ కోర్సులతో పాటు వృత్తివిద్యా కోర్సులపై తెలియజేసి కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థితో ఉపాధ్యాయులు

చదువుకు వైకల్యం అడ్డు కాదు

కవిటి: చదువుకు వైకల్యం అడ్డుకాదని సమగ్ర శిక్షా అభియాన్ సహిత ఉపాధ్యాయులు కృష్ణారావు, అరుణ్ కుమార్ అన్నారు. 18 ఏళ్లలోపు వయసు కలిగిన వికలాంగ బాలబాలికలను గుర్తించి వారిని బడిలో చేర్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కొత్తూరు, కపాసుకుద్ది గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను, స్థానిక సచివాలయాలను సందర్శించారు. ఇప్పటి వరకూ పది మంది విద్యార్థులను గుర్తించామని, వారిని సమీపంలోని పాఠశాలల్లో చేర్పించి వారికి రవాణా ఛార్జీలతో పాటు ఉపకార వేతనం, వారికి అవసరమైన చెవిటి మిషన్లు, కళ్లద్దాలు, చంక కర్రలు, మూడు చక్రాల సైకిళ్లు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు.

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని ఏడవ వార్డు చింతాడ వారపు సంత నుంచి ప్రతి శనివారం లారీలు వ్యాన్లలో పశువుల అక్రమ రవాణాను యథేచ్ఛగా కొందరు వ్యక్తులు సాగిస్తున్నారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ తదితర మండలాల్లో ఉన్న రైతుల దగ్గర నుంచి పశువులను కొనుగోలు చేసి చింతాడ సంతకు తరలించి అక్కడ నుంచి విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉన్న కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పశు వైద్యాధికారులు, పోలీసులు ఇటువంటి వారిపై నిఘా పెట్టి అక్రమ రవాణాను అడ్డుకొని పశువులను గోశాలకు తరలించేవారు. ఇటీవల కాలంలో అధికారులు పశువుల అక్రమ రవాణాపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో పశువుల అక్రమ రవాణా ముఠా విచ్చలవిడిగా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంశధార నది అవతల వైపున ఉన్న జలుమూరు, నరసన్నపేట మండలాల నుంచి పశువులను కొనుగోలు చేసి వంశధార నది దాటించి పురుషోత్తపురం యరగాం వంటి గ్రామాల నుంచి వాహనాల్లో పశువులను తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమదాలవలస, చింతాడ సంత, కనుగులవలస, వంజంగి, పురుషోత్తపురం వంటి గ్రామాల్లో కొంతమంది గుత్తేదారులను ఏర్పాటు చేసుకుని పాడి అయిపోయిన ఆవులను తక్కువ రేట్లకు కొనుగోలు చేసి అక్కడి నుంచి విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు పశువులను తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు పశు వ్యాపారులతో కుమ్మక్కై చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పశు అక్రమ రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాహనాల్లో తరలించడానికి సిద్ధం చేస్తున్న పశువులు

మామిడిలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం

వాతావరణ మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి దిగుబడులు బాగా తగ్గాయి. ఈ ఏడాది సీజన్ ముగింపునకు వచ్చేస్తోంది. కోతల తర్వాత అవసరమైన చోట్ల నీరు పెట్టి సూచించిన విధంగా యాజమాన్యం చేస్తే వచ్చే ఏడాది పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాయల కోత పూర్తయిన తరువాత మామిడి చెట్లు కాస్త బలహీనపడతాయి. ఈ పరిస్థితిని సరిదిద్దడానికి కోతల తర్వాత చెట్లకు యూరియా (లీటరు నీటికి 10 నుంచి 15 గ్రాములు), ఫార్ములా-4 సూక్ష్మపోషక మిశ్రమం (3 గ్రాములు లీటరు నీటికి) కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. చెట్ల నుంచి కాయలు కోసిన తర్వాత, మామిడి తోటలో ఎలాంటి పనులు చేపట్టకుండా 15 నుంచి 20 రోజుల పాటు విశ్రాంతి నివ్వాలి. విశ్రాంతి తర్వాత, చెట్లకు ఉన్న గత పంటలోని కాయ కాడలను, పూత కాడలను కత్తిరించి తొలగించాలి. దీని వలన కొత్త చిగుర్లు వృద్ధిచెంది అవి ముదిరి, తర్వాత కాలంలో పూత రావడానికి దోహదపడుతుంది. చెట్లలో భూమి వైపు వాలిన కొమ్మలను సేద్య పనులు సులభంగా చేసుకునే విధంగా కత్తిరించుకోవాలి. చెట్లలో ఏవైనా తెగుళ్ల, పురుగులు ఎక్కువగా ఆశించిన కొమ్మలు ఉంటే వాటిని కత్తి రించి నాశనం చేయాలి. చెట్లలో అడ్డదిడ్డంగా కొమ్మలు పెరిగిపోయి చెట్ల లోపల గాలి వెలుతురు సరిగా తగలకపోతే చీడపీడల సమస్య అధికం కావడమే కాకుండా ఆ చెట్లలో పూత సరిగారాదు. ఇలాంటి చెట్లలో చెట్ల పై భాగాన కొమ్మలను, లోపల అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి చెట్టులోపల గాలి, సూర్యరశ్మి బాగా సోకే విధంగా ఏర్పాటు చేయాలి. దీనివలన చెట్లు ఆరోగ్యంగా పెరిగి తర్వాత కాలంలో పూత బాగా వస్తుంది. తోటలో కత్తిరించగా కిందపడిన కొమ్మలను, రెమ్మలను శుభ్రంగా తొలగించి తోటకు దూరంగా వేసుకోవాలి లేదా నాశనం చేయాలి. కత్తిరింపులు చేసి చెట్ల భాగాలు బాగా తడిసేటట్లు కాపరాక్సీ క్లోరైడు లేదా బ్లైటాక్స్ (లీటరు నీటికి 3 గ్రా) ద్రావణంతో పిచికారీ చేయాలి. మామిడి తోటల్లో కత్తి రింపులు పూర్తి చేసిన తర్వాత సిఫార్సుల మేరకు పంట యాజమాన్యం చేపట్టి తర్వాతి పంటకు చెట్లను సిద్ధం చేయాలి.

నేడు జీడి రైతుల సమావేశం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జీడి రైతుల సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జీడి పిక్కల కొనుగోలుపై కార్యాచరణ నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి జీడి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు సుందరయ్య వర్ధంతి వేడుకలు

సిఐటియు కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. వర్ధంతి వేడుకలకు సిపిఎం నాయకులు, సిఐటియు నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పళ్లను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

వికలాంగులకు పళ్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరుతో ట్రస్టును నెలకొల్పి ప్రజలకు సేవలందించడం ప్రశంసనీయమని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధి ఎస్. జోగినాయుడు అన్నారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.ఆర్.గంజి, ఆయన కుమారుడు ట్రస్టు సభ్యులు ప్రొఫెసర్ గంజి సంజీవయ్య వర్ధంతి కార్యక్రమం నగరంలోని మథర్ థెరిసా హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై హోంలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా ఎస్ఆర్ గంజి, సంజీవయ్యల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ట్రస్టును నెలకొల్పి అనేక మందికి సేవలు అందించిన ఎస్.ఆర్.గంజి, గంజి సంజీవయ్యలు కోవిడ్ సమయంలో మరణించారని గుర్తు చేశారు. వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ ట్రస్టు ద్వారా సేవలందిస్తున్న గంజి ఎజ్రాను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కాటమ్ హనిరోజ్, న్యాయవాది కట్టా పార్థసారధి, ఎన్.కిరణ్, బి.రవీంద్రబాబు, మాజీ సర్పంచ్ అలుదు అప్పన్న, ఆర్.పి.రావు, అబ్రహం, వై.శ్రీనివాసరావు, ఎ. ఏసుదాసు, ఎం. రమణ తదితరులు పాల్గొన్నారు.

374 పశువులకు టీకాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని కురుడు పంచాయతీ పరిధిలో ఉన్న చౌదరికొత్తూరు, బావాజీపేట, యరకయ్యపేట, పొన్నానపేట, అలాగే యలమంచిలి పంచాయతీలో నూకపేట, యలమంచిలి గ్రామాల్లో 374 పశువులకు శనివారం ఉచిత జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేశామనిస్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు షెడ్యూల్ ప్రకారం వేస్తున్నామని తెలిపారు. రైతులందరూ పశు వైద్య సిబ్బందికి సహకరించి తమ పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. సరైన కాలంలో సక్రమంగా టీకాలు వేయించుకుంటే వ్యాధులు రాకుండా నివారించ్చునన్నారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులు ఎక్కువగా మృతి చెందాయని చెప్పారు. మూడు మాసాల నుంచి ఏడు మాసాలు దూడలు ఈ వ్యాధి బారిన పడి 90 శాతం దూడలు మృతి చెందుతాయని అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు మేత ఆపడం, లేవలేకపోవడం ఎక్కువగా వెనుక కాళ్ల కండరాలలో గాలి చేరి, కణజాలము కుళ్లుతుందన్నారు. దీనివల్ల అధికంగా 104-105 డిగ్రీల జ్వరం వచ్చి చనిపోతుంటాయని తెలిపారు. పాడి రైతులు తమ పశువులను ఉచిత టీకాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కె.ముకుందరావు, శోభ, సహాయకులు నారాయణరావు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

రైతుల పేర్లు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి- సోంపేట

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, జీలుగు విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని సోంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.జగన్ మోహనరావు, వ్యవసాయ అధికారి నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం బారువ రైతు భరోసా కేంద్రం వద్ద రైతు నమోదు, రైతు వాటర్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. నమోదు చేసుకున్న ప్రాప్తికి త్వరలో విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులంతా తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు, ఎరువులకు సంబంధించి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఉత్సవాలు ప్రారంభం

పాతపట్నం: స్థానిక నీలమణి దుర్గ ఉత్సవాలు శనివారం ప్రారంభ మయ్యాయి. ఈ ఉత్సవాలు 9 రోజులు నిర్వహించనున్నారు. యాత్రికుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పక్కాగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ

ప్రజాశక్తి- పలాస

పక్కాగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వెంకటరమణ సూచించారు. మండలంలోని అల్లుకోల, లొద్దభద్ర, రెంటికోట గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను వేర్వేగా సేకరించాలన్నారు. ఆ చెత్తను వేరు చేసి తడి చెత్తను సేంద్రియ ఎరువులుగా, పొడి చెత్తను ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వాటి నుంచి వచ్చే ఆదాయాన్ని పంచాయితీ అభివృద్ధికి వెచ్చించాలన్నారు. వీటి ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, డిపిఆర్‌సి రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు, కార్యదర్శులు సద్గుణ, శరత్, చిరంజీవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపిఒ వెంకటరమణ

గురజాడ విద్యాసంస్థల్లో ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని మునసబుపేట గాయత్రి కళాశాలలో ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం ఆదివారం ప్రారంభమైందని 14వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ డాక్టర్ ప్రసంకుమార్ పాండా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక శిక్షణా శిబిరం పది రోజులు జరుగుతుందని, ఈ శిబిరంలో 458 మంది ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొంటున్నారని దీని శిక్షణ కొరకు ప్రపంచంలోని అత్యంత సమర్థత కలిగిన నైపుణ్యం కలిగిన ఆర్మీ స్టాఫ్‌తో వివిధ మిలట్రీ అంశాల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాడెట్లకు సాంఘిక, సాంస్కృతిక అంశాలతో పాటు ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు, సమాజ సేవ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిబిరంలో ఈ వార్షిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ స్థాయి శిబిరాలకు శిక్షణ కార్యక్రమాలకు 14వ ఆంధ్ర బెటాలియన్ విద్యార్థుల ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ మేజర్ వంగా మహేష్, సుబేదార్ మేజర్ సుభాష్ చంద్ర, కెప్టెన్ పోల్ నాయుడు, లెఫ్ట్ నెట్ రవికుమార్, సెకండ్ ఆఫీసర్ లక్ష్మణరావు, సెకండ్ ఆఫీసర్ శరత్‌కుమారి, లెఫ్టినెంట్ రేవతి, ఫస్ట్ ఆఫీసర్ హరికృష్ణ, కేర్‌టేకర్ టి.కేశవ నాయుడు, సుబేదార్ దల్వీర్ సింగ్ నాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొంటున్న క్యాడెట్లకు గురజాడ విద్యాసంస్థల అధినేత జీవి స్వామి నాయుడు, కరస్పాండెంట్ అంబటి రంగారావు, సంచాలకులు జి.సంయుక్త, విద్యా సంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ పలకడం శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

శిక్షణలో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్లు

తాతయ్యను పరామర్శిస్తున్న ప్రకాష్

ప్రకాష్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుండే ప్రకాష్ శిలగాంకు చెందిన క్షతగాత్రుడు కాల తాతయ్యకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం శనివారం అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. నిర్మాణ పనుల్లో భాగంగా బండి పైనుంచి టైల్స్ బయటకు తీస్తుండగా ప్రమాదశాత్తు తాతయ్య మీదపై పడి కాళ్లు విరిగిపోయాయి. దీంతో తాతయ్యని విశాఖలో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రెక్కాడితే గానీ డొక్కాడని తాతయ్య కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేఘనాథం, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పశువుల సంచారం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో పశువులతో నిండిపోయింది. ఎటుచూసినా పశువులు సంచరించడంతో ప్రయాణికులు, వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ సమీపంలో మున్సిపల్ దుకాణాలు, రోడ్లపై కూరగాయలు పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి పశువులు నానా అవస్థలు పెడుతున్నాయి. కిరణా దుకాణాల్లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు తినేయడంతో ఏమి చేయాలో తోచక ఇబ్బందులు పడుతున్నారు. పశువులను రోడ్లపైకి విడిచి పెట్టరాదని మున్సిపల్ అధికారులు పశువుల యజమానులకు చెబుతున్నా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సంచరిస్తున్న పశువులు

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుర్రాలపాళెం మాజీ సర్పంచ్ షేక్ అలీమా బీబీ (85) శనివారం తెల్లవారు జామున అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళంలోని తన కుమారుడు ఇంటి వద్ద మృతి చెందారు. ఈమె గుర్రలపాళెం గ్రామానికి రెండు పర్యాయాలు సర్పించ్‌గా పనిచేశారు. మొదట్లో ఈమె పెద్దకుమారుడు షేక్ అలీబాబా సర్పించ్‌గా పనిచేశారు. ఇప్పుడు ఈమె చిన్న కుమారుడు షేక్ చంద్ బాషా సర్పంచ్‌గా పని చేస్తున్నారు. ఈమెకు ఏడుగురు సంతానం కాగా నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. అలీమా బీబీ మృతికి పలువురు నివాళ్లర్పించారు. అనంతరం శ్రీకాకుళంలో అంత్య క్రియలు నిర్వహించారు.

అలీమా బీబీ (ఫైల్)

ఎమ్మెల్యే పరామర్శ

మాజీ సర్పంచ్ ఆలీమా బీబీ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి తన సంతాపాన్ని తెలిపారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి దన్నాన రాజీనాయుడు, ఎంపిటిసిలు సంగం, మండల అధ్యక్షుడు జగ్గురోతు తవిటి నాయుడు, శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఉన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పూర్తి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఉమ్మడి జిల్లాలో అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ పూర్తి చేశారు. దుప్పలవలస, కొల్లివలస, కంచిలి, ఉంగరాడ మెట్ట బాలుర జూనియర్ కళాశాలలో 320 సీట్లకు 65 ఖాళీలు మిగిలాయి. బాలికల గురుకుల కళాశాల ఎచ్చెర్ల, పెద్దపాడు, తామరవల్లి, నందిగాం, మందస, పాతపట్నం, వంగర, భామినిలో 720 సీట్లుకు 156 ఖాళీలు ఉన్నాయని, వాటి వివరాలను కో-ఆర్డినేటర్ లాజీ రాష్ట్ర కార్యదర్శికి అందజేశారు. ప్రవేశాల మార్గదర్శికాలు వచ్చిన తరువాత ప్రవేశాలు చేపట్టనున్నారు. ప్రవేశ పరీక్షా ర్యాంకులతో సంబంధం లేకుండా 10వ తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశించే విషయం పరిశీలిస్తున్నారు.

మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ ప్రతాప్

వేసవి శిబిరాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, ప్రతి విద్యార్థి వేసవి శిక్షణ శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రిసోర్స్‌పర్సన్ నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జోష్యుల ప్రతాప్ అన్నారు. శనివారం లావేరు శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థి క్లాస్ పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయాలకు వచ్చి జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను ప్రతిరోజు దిన, వార, మాస పత్రికలను పూర్తిస్థాయిలో చదువు కోవాలన్నారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి. వీరభద్రుడు విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న రమణమ్మ

మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రికి వచ్చి వెళ్లే రోగులు, వారి సహాయకులు, సిబ్బంది ఉపశమనం పొందడానికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. శనివారం రిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో రాజాం పట్టణ ఎఎస్ఐగా పని చేస్తున్న ఎల్.రమణమ్మ హాజరై ఆర్థిక సాయాన్ని అందించారు. వాతావరణంలో మార్పుల వల్ల జ్వరాలు, డెంగీ, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈసమయంలో మిత ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్యపరంగా అన్ని జాగ్రత్తలు పాటించడంతో పాటు అధికంగా ద్రవ పదార్థాలను తీసుకోవాలన్నారు. వడ దెబ్బకు గురి కాకుండా నీడ ప్రదేశాల్లో ఎక్కువ సేపు ఉండే విధంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శివతేజ, జి.పవన్‌కుమార్, నంది ఉమాశంకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ స్తంభాల లైన్లకు మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసనగర్, రోటరీ నగర్, నెహ్రూ నగర్, నిత్యానంద నగర్, పడా క్వార్టర్స్, పద్మనాభపురం, పూజారివీధి, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

కవిటి: కవిటిలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి లైన్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కవిటి టౌన్ లైన్ మైంటేనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, కవిటికొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడ పుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు.

'పద్మావతి' విద్యార్థుల ప్రతిభ

నరసన్నపేట: డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన బలగ శ్రావణి 8.25 పాయింట్లు సాధించగా, బిఎ విభాగానికి చెందిన పోతల యామిని 8.2, బి.కాం విభాగానికి చెందిన పల్లి నీరజ 7.95 పాయింట్లు దక్కించుకున్నా రు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డి.వి. రమణమూర్తి, అకాడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.